

బారికేడ్లు లేకుండా చేపట్టిన క్యాచ్ పీట్ల పనులు

జీహెచ్‌ఎంసీ ఏఈ సస్పెన్షన్

ఖైరతాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించని ఏఈని జోనల్ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఖైరతాబాద్‌జోన్ మెహిదీపట్నం సర్కిల్‌కు చెందిన ఏఈ కె.లాల్‌సింగ్ చింతలబస్తీలో వర్షంనీరు వెళ్లే క్యాచ్ పీట్ల పనులు చేయిస్తున్నారు. ప్రధాన రోడ్డుపై ఈ పనులు జరుగుతున్నప్పుడు అధికారులు వాహనదారులు, పాదాచారులను అప్రమత్తం చేయాలి. అలా కాకుండా, కనీసం బారికేడ్లు పెట్టకుండా పనులు చేయించినట్లు తెలుసుకున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఏఈని మంగళవారం సస్పెండ్ చేశారు.

సర్కిల్-17కు కొత్త అధికారులు



చంద్రశేఖర్

ఖైరతాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీల్లో ఖైరతాబాద్ సర్కిల్‌కు కొత్త అధికారులు వచ్చారు. సర్కిల్ వైద్యాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి కూడ ఇటీవలే బదిలీపై వచ్చారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీర్లు

సమస్యలను పరిష్కరించాలని ఇంజనీర్ల నిరసన

పంజాగుట్ట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్‌సంస్థల్లో పనిచేస్తున్న ఇంజనీర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీజీపీఈఏ), తెలంగాణ ఎంప్లాయిస్ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్(టీజీఈఏఈఏ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం భోజన విరామ సమయంలో జీటీఎస్‌కాలనీలోని మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ రూరల్ జోన్ కార్యాలయం ఎదుట వివిధ క్యాడర్‌లలో పనిచేస్తున్న ఇంజనీర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌కోలో ప్రస్తుత నిబంధనలు, వర్క్ లోడ్‌కు అనుగుణంగా అదనపు పోస్టులు మంజూరు చేసి, అన్ని క్యాడర్లలో ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించాలని, 2012 బ్యాచ్ ఏఈలకు ఏడీఈలుగా పదోన్నతులు ఇవ్వాలని, ఏఈ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రామగుండంలో నిర్మించబోయే జనరేషన్ ప్లాంట్‌ను టీజీజెన్కో ఆధ్వర్యంలో నిర్మించాలని, ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వెంకటనారాయణరెడ్డి, కిరణ్ కుమార్, కిషోర్ కుమార్, వెంకటేశ్వర్, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, నరేష్, దామోదర్, వెంకటరమణ, రాంకోటి, బ్రహ్మారెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఖైరతాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ విధిగా స్వచ్ఛ ఆటో టిప్పర్లకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. ఖైరతాబాద్ ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, వైద్యాధికారి చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి ఎంఎస్ మక్తా, బీఎస్ మక్తాలో పారిశుధ్య పనితీరుపై మంగళవారం ఆయన ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. స్వచ్ఛ ఆటో టిప్పర్ల వారు 100 శాతం ప్రతీ ఇంటికి వెళ్లేలా చొరవ చూపాలని సూచించారు.

డీఎంసీ ఆగ్రహం..

ఎన్టీఆర్‌మార్గంలో చిరు వ్యాపారులు చెత్తను తమ వద్దే ఉంచుకొని సిబ్బందికి అందజేయాలని డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ మార్గంలో పర్యటించారు. అక్కడ చిరు వ్యాపారుల ద్వారా రోడ్డుపై పడ్డ చెత్తను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలు ప్రతి సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలని, చిరు వ్యాపారులను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు.

సెప్టెంబర్ 1 నుంచి 'పాజ్ అండ్ రిఫ్లెక్ట్' చిత్రప్రదర్శన



కళాకారులు గీసిన చిత్రం

బంజారాహిల్స్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచి అయిన నగరం మరో ప్రత్యేకమైన ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు వేదిక కానుంది. ఢిల్లీ ఆర్ట్ మాగ్నమ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీవరకు స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'పాజ్ అండ్ రిఫ్లెక్ట్' చిత్రప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ క్యూరియేటర్ అన్నపూర్ణ తెలిపారు. కళాకారులు ధ్రువ్‌పటేల్, దుష్యంత్, రఘు, ముఖ్తార్ అహ్మద్ తమ ప్రత్యేకమైన కళాఖండాలను ఈ ప్రదర్శనలో ప్రదర్శించనున్నారు.

ఈ రోడ్డుపై నడిచేదెలా?

- అధ్వానంగా దీన్‌దయాళ్‌నగర్ రోడ్డు
- వర్షానికి కొట్టుకుపోయి.. తేలిన రాళ్లు, మట్టి
- మూడు నెలలుగా ఇదే దుస్థితి



రాళ్లు, మట్టి తేలి నడిచేందుకు వీలు లేని దీన్‌దయాళ్‌నగర్ రోడ్డు

బంజారాహిల్స్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం.. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదతో ఆ బస్తీ నీట మునిగింది. ఇళ్లలోకి వరద నీరు వచ్చాయి. వర్షం వెలిశాక రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరి కనీసం అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ఎటు చూసినా రాళ్లు, మట్టి గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి కనిపిస్తున్నాయి. ఫిలింనగర్ దీన్‌దయాళ్‌నగర్‌లో రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటనలు చేస్తున్నారు తప్పితే రోడ్డు నిర్మాణ పనులు చేయించడం లేదు. మూడు నెలలుగా ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నట్లు బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంకర.. మట్టిదిబ్బలు

మూడు నెలల క్రితం నగరంలో కురిసిన భారీ వర్షం కారణంగా దీన్‌దయాళ్‌నగర్‌ను వరద ముంచెత్తింది. ఎన్నడూ లేని విధంగా వరదనీరు ఇళ్లలోకి ప్రవేశించాయి. వరదనీటి దాటికి రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బస్తీలో ఉన్న ఎల్లమ్మ ఆలయం ప్రహరీ మొత్తం కూలింది. ఆలయం ముంపునకు గురైంది. బోనాల పండుగ నేపథ్యంలో హుటాహుటిన జీహెచ్‌ఎంసీ అధికారులు, కార్పొరేటర్ పర్యటించారు. బోనాల కోసం కావాల్సిన చర్యలు తీసుకున్నారు. రోడ్డు పనులు చేపడతామని చెప్పినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. తాజాగా పది రోజుల క్రితం వరకు కురిసిన కుండపోత వర్షాల కారణంగా బస్తీని మరోసారి వరద ముంచెత్తింది. ఎగువ ప్రాంతం నుంచి ఇసుక, రాళ్లు బస్తీలోకి కొట్టుకువచ్చాయి.

అసలే శిథిలావస్థకు చేరిన రోడ్డుపై ఇప్పుడు కంకర, మట్టి దిబ్బలు కనిపిస్తున్నాయి. కనీసం అడుగు కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. నిత్యావసరాల కోసం ఇళ్ల నుంచి బయటకు వస్తున్న వారు ప్రతి నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం రాళ్లు, మట్టిని తొలగించేందుకు కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాలు గర్వించదగ్గ వ్యక్తి చంద్రబాబు

- విశ్రాంత న్యాయమూర్తి భవానీప్రసాద్



చంద్రబాబునాయుడు ఎక్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి భవానీప్రసాద్, ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ బాషా తదితరులు

బంజారాహిల్స్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలు గర్వించదగ్గ వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జి.భవానీప్రసాద్ అన్నారు. వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పలు రంగాల్లో ప్రగతి సాధించేందుకు ఆయన తీవ్రంగా శ్రమించారని, శ్రమిస్తున్నారని అన్నారు. పాత్రికేయుడు రచించిన చంద్రబాబు ఎక్స్ పాయింట్ ఎక్స్‌ఓ పుస్తకాన్ని ఫిలింనగర్ కల్చరల్ క్లబ్‌లో మంగళవారం ఏపీ రెరా మాజీ చైర్మన్ డాక్టర్ రామనాథ్ వెలమటి, మదనపల్లి ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ బాషాతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ రచయిత రాజకీయ వివాదాల జోలికి వెళ్లకుండా కేవలం చంద్రబాబునాయుడు ఆలోచనా విధానం, అభివృద్ధి విషయంలో విజన్‌ను మాత్రమే ప్రస్తావించడం అభినందనీయమన్నారు. న్యాయవ్యవస్థలో కొన్ని పనుల నిమిత్తం చంద్రబాబుతో పనిచేసిన అనుభవం తనకు ఉందని తెలిపారు. తెలుగు నేలకు, తెలుగు జాతికి ఏదో ఒక్కటి చేయాలనే ఉద్దేశంతో నిరంతరం తపించిపోతారని అన్నారు. ముఖ్యమంత్రి కాకముందు టీడీపీలో జరిగిన పరిణామాల తాలూకు జాడ తన పాలనలో ఉండకుండా కేవలం ఎన్టీఆర్ ఆశయాలను అమలు చేసేందుకు మాత్రమే బాబు కష్టపడుతున్నారన్న విషయం ప్రస్తుత పాలన తీరును చూస్తేనే అర్థం అవుతుందన్నారు. 1995లో తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు ఆనాటి న్యాయశాఖలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందుకోసం ఆయన ఎందరో న్యాయమూర్తుల సలహాలు, సూచనలు తీసుకున్నారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఆలోచన గురించి పుస్తకం రావడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఏపీ రెరా మాజీ చైర్మన్ డాక్టర్ రామనాథ్ వెలమటి మాట్లాడుతూ ఓవైపు వ్యవసాయంపై దృష్టి పెడుతూ మరోవైపు ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను ఎలా అభివృద్ధి చేయాలి.. భవిష్యత్తులో తలెత్తే ముప్పును ఎలా ఎదుర్కోవాలనే విజన్‌తో పనిచేయడం కేవలం చంద్రబాబుకే సాధ్యమన్నారు. సాఫ్ట్‌వేర్ రంగం తెలుగు రాష్ట్రాలకు వచ్చినప్పుడు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆయన స్థలాల కేటాయింపు చేశారని, ఆ అభివృద్ధి ఇప్పుడు అందరూ చూస్తున్నారని తెలిపారు. విభజిత ఏపీని కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగల సమర్థత కేవలం చంద్రబాబుకే ఉందన్నారు. ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ బాషా మాట్లాడుతూ చంద్రబాబుతో సుదీర్ఘ కాలం పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, నెక్స్‌టెల్ మెట సీఈఓ మిక్కిలినేని శ్రీకాంత్, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు భవనం షకీలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్, దేవాదాయ భూముల బాధ్యతను హైడ్రాకు ఇవ్వాలి

- ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి

పంజాగుట్ట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆక్రమణకు గురైన వక్ఫ్, దేవాదాయ భూముల స్వాధీన బాధ్యతను హైడ్రాకు అప్పగించాలని ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎండీ ఇస్లాముద్దీన్ కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు అనే తేడా లేకుండా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను రాజకీయ నాయకులు, సంపన్నులు కబ్జా చేశారని ఆరోపించారు. బండ్లగూడలోని సల్కంచెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌ను ఆక్రమించి ఒవైసీ సోదరులు ఫాతిమా ఒవైసీ కాలేజీని నిర్మించారని, వారు కబ్జా చేసి నిర్మించిన వాటిని కూల్చేయాలని కోరారు. అలాగే, రాష్ట్రంలో వక్ఫ్ భూములు, దేవాదాయ భూములు వేల ఎకరాల్లో ఆక్రమణల్లో ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకునే బాధ్యతను హైడ్రాకు అప్పగిస్తే తాము అండగా ఉంటామని అన్నారు. 75 ఏళ్లుగా ఏ ప్రభుత్వం చేయని పనిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా ఉండాల్సిన అవసరం ఉందని ఇస్లాముద్దీన్ పిలుపునిచ్చారు.



శ్రీదల ప్రభుపాదాలకు పూజలు చేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు

ఘనంగా వ్యాస పూజ

బంజారాహిల్స్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్.12లోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి(స్వర్ణ) ఆలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం వ్యాసపూజ మహోత్సవం, నందనోత్సవం ఘనంగా జరిగింది. నందనోత్సవంలో భాగంగా గోదాకృష్ణ అభిషేకం, శ్రీకృష్ణుడి సంకీర్తన సేవ నిర్వహించారు. వ్యాస పూజలో భాగంగా శ్రీదల ప్రభుపాదాలకు మహాభిషేకం నిర్వహించి 1008 రకాల నైవేద్యాలు సమర్పించారు.

కులం పేరుతో దూషిస్తూ కానిస్టేబుల్‌పై దాడి

- నా పైనే దాడి చేశారని మరో ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు అకారణంగా కానిస్టేబుల్‌ను కులం పేరుతో దూషించడమే కాకుండా దాడి చేశారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన పి.రాకేష్ హెడ్‌క్వార్టర్స్‌లో కానిస్టేబుల్. ఈ నెల 26న తన స్నేహితులు రాజ్‌కుమార్, సుధీర్, నవీన్‌తో కలిసి కారులో కృష్ణకాంత్ పార్కుకు వచ్చారు. కారు పార్కు చేసి నడుచుకుంటూ వెళ్తున్నారు. జవహర్‌నగర్ మార్కెట్ వద్ద నవీన్‌ను అక్కడ మద్యం మత్తులో ఉన్న శివ, కార్తీక్ పిలిచారు. నవీన్ వెళ్లి మాట్లాడుతుండగా, శివ, కార్తీక్‌లు రాకేష్‌ను అత్యంత పరుష పదజాలంతో దూషించారు. ఎందుకు తిడుతున్నారని రాకేష్ ప్రశ్నించగా దాడి చేశారు. బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, శివకుమార్ తన మిత్రుడు నవీన్‌తో మాట్లాడుతుండగా అక్కడే రాకేష్, రాజ్‌కుమార్ ఉన్నారని, వారిని కూడా పలకరించగా అకారణంగా తనపై దాడి చేశారని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరుపక్షాల ఫిర్యాదులు తీసుకున్నారు.

నాలాలో గుర్తు తెలియని మృతదేహం

- జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద కలకలం

ఖైరతాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉన్న స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా పక్కనున్న నాలాలో కనిపించడం కలకలం రేపింది. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యక్తి మృతదేహం నాలాలో ఉన్నదని 100కు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు సమాచారం వచ్చింది. పోలీసులు అక్కడకు వచ్చి చూడగా మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంది. ముఖం గుర్తించడం కష్టంగా ఉంది. మృతదేహాన్ని నాలా నుంచి పక్కకు తరలించి క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. వారు ఆధారాలు సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 45 నుంచి 55 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.6 అడుగులు ఉంటాడని, చామనఛాయ రంగులో ఉన్నాడని, వంటిపై యాష్ తెలుపురంగు గడుల చొక్కా, యాష్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. సంబంధికులు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11కేవీ అన్నపూర్ణ స్టూడియో ఫీడర్ పరిధి, ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11కేవీ ఎల్వీప్రసాద్ ఫిల్మ్‌ల్యాబ్ ఫీడర్ పరిధి, మధ్యాహ్నం 12.45 గంటల నుంచి 1.30 గంటల వరకు 11కేవీ సినిమ్యాక్స్ ఫీడర్ పరిధి, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 11కేవీ జింఖానా క్లబ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

1న మట్టిగణపతి విగ్రహాల తయారీ పోటీ

సనత్‌నగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా పిల్లలకు పర్యావరణాన్ని రక్షించడం, పండుగ ప్రాశస్త్యం తెలిపేందుకు మట్టిగణపతి తయారీ పోటీలను నిర్వహిస్తున్నట్లు మోడల్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మోడల్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్లో సెప్టెంబర్ 1న నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు 14ఏళ్లలోపు బాలబాలికలు అర్హులని తెలిపారు. ప్రతిమ తయారీకి అవసరమైన మట్టిని అందిస్తామని, అలంకరణ సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న పిల్లలు 8008352140కు వాట్సాప్ చేసి పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

'మోడల్'గా తీర్చిదిద్దారు!

- కాలనీవాసులే అభివృద్ధి చేసిన బృందావనం పార్కు



బెంచీలు



బృందావనం పార్కులో మొక్కలు

మోడల్ కాలనీవాసులు చేయి చేయి కలిపి బృందావనం పేరుతో అందమైన పార్కును అభివృద్ధి చేసుకున్నారు. ఈ పార్కు నిర్వహణను చూసిన జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రశంసలు కురిపించారు.

సనత్‌నగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, అరుదైన వృక్షజాతికి చెందిన చెట్లతో ఆహ్లాదాన్ని పంచుతున్న మోడల్ కాలనీ బృందావనం పార్కు సందర్శకులకు ప్రశాంతతతోపాటు ఆహ్లాదాన్ని పంచుతోంది. కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పార్కుకు జీహెచ్‌ఎంసీ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గార్డెన్ ఫెస్టివల్‌లో మొదటి బహుమతి దక్కింది. సువాసనలు వెదజల్లే పూలమొక్కలు, పూలపై వాలే సీతాకోక చిలుకలు, చెట్లపై చిలుకలతో పార్కు కళకళలాడుతోంది. కాలనీవాసులు పార్కులో మొక్కలను పెంచేందుకు ఆసక్తి చూపిస్తుండడం అభినందనీయం. వర్షపు నీరు వృథా కాకుండా పార్కులోనే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. కాలనీవాసులు కలిసి కట్టుగా నిర్ణయం తీసుకుంటే ఇలాంటి పార్కులు నగరం మొత్తం వెలుస్తాయని జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొన్నారు.

ప్రశాంతత..

పార్కులో మెత్తటి పచ్చిక, పాత్‌వే, కూర్చునేందుకు బెంచీలు ఉన్నాయి. వాకింగ్‌కు వచ్చేవారు, సందర్శకులు, పిల్లలు, వయోవృద్ధులు ఈ పార్కు లో సేదతీరేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతేగాకుండా పచ్చదనంతో ఉట్టిపడుతున్న ఈ పార్కులో కాలనీవాసులు పలు వేడుకలు నిర్వహించుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఫంక్షన్‌హాళ్లు, నాలుగు గోడల మధ్య వేడుకలు చేసుకోవడం కన్నా, పచ్చటి చెట్ల మధ్య ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకే ఆసక్తి చూపుతున్నారు.

బయో గ్యాస్ ఉత్పత్తి..

అరుదైన మొక్కలు, చెట్లను కాలనీవాసులు పార్కులో నాటి వాటిని సంరక్షిస్తున్నారు. మారేడు, ఉసిరి, మామిడి, తులసి, నందివర్ధన, అశోక, సన్నజాజి, అరటితో పాటు అశ్వగంధ, గంధం, రాధా మాధవి వంటి అరుదైన మొక్కలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇక్కడి చెట్ల నుంచి రాలే ఆకులను, చెత్తను బయటకు తరలించకుండా పార్కులోనే పెద్ద గొయ్యి ఏర్పాటు చేసి, బయోగ్యాస్ ఉత్పత్తి చేసుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు.





అరుదైన మొక్కలు



వాకింగ్ ట్రాక్

కాలనీవాసుల సమష్టి కృషి

జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మోడల్ కాలనీవాసులందరూ కలిసి బృందావనం పార్కును తీర్చిదిద్దుకున్నాం. ఎన్నో ప్రశంసలు వచ్చాయి. వర్షపు నీరు బయటకు పోకుండా ఇంకుడు గుంతలు, చెత్తతో బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నాం. కాలనీవాసులు అరుదైన చెట్లు, పూలమొక్కలు తెచ్చి పార్కు శోభను మరింత పెంచారు.

\- జేఎస్‌టీ సాయి, మోడల్ కాలనీ ప్రతినిధి



సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి కలుగుతున్న అసౌకర్యాన్ని తొలగించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో గల కరీం కాంపౌండ్‌లో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి, అక్కడ నెలకొన్న సమస్యల గురించి స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో డ్రైనేజీ పైపులైన్ వేసినప్పటికీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమకు నల్లా ద్వారా వచ్చే నీరు కలుషితం అవుతున్నాయని, పలుచోట్ల స్ట్రీట్ లైట్లు లేవని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెటంనే స్పందించిన ఎమ్మెల్యే డ్రైనేజీ లైన్లను చెక్ చేసి, రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అవసరమైన చోట్ల స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయాలని, అలాగే కులుషిత నీరు ఎక్కడ కులసుస్తున్నాయో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ ధర్మారెడ్డి, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, జీహెచ్ఎంసీ ఏఈ శివరాం, ఎంటమాలజీస్ట్ శ్రీనివాస్ రెడ్డి, స్ట్రీట్ లైట్ ఏఈ భరత్, మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లికార్జున్‌గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నర్సింగం, సతీష్, ప్రధాన కార్యదర్శి గణేష్, ఉజ్జయినీ మహాకాళి దేవాలయ మాజీ ధర్మకర్తలు కౌశికె కిషోర్ కుమార్, మహేష్ యాదవ్, మహేందర్, చంద్రప్రకాష్, అరుణ్ భట్, నాయకులు సత్యనారాయణ, జనార్ధన్, సాయి, బస్తీవాసులు లతీఫ్, జబ్బార్, బాలేష్ యాదవ్, రబ్బానీ, రహీం పాల్గొన్నారు.

గర్ల్ ఫ్రెండ్ కోసం కొట్టుకున్న విద్యార్థులు

● 15నిమిషాల పాటు ట్రాఫిక్ జాం

● గతంలోనూ ఇలాంటి ఘటనలు

అడ్డగుట్ట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): గర్ల్‌ఫ్రెండ్ కోసం తలెత్తిన వివాదంతో రెండు వర్గాలుగా విడిపోయిన కళాశాల విద్యార్థులు రోడ్డుపై కొట్టుకున్న ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సికింద్రాబాద్ ఎస్‌డీ రోడ్డులో మంగళవారం వెలుగులోకి వచ్చింది. మధ్యాహ్నం సమయంలో హెవ్ మోర్ హోటల్ ముందు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థులు రెండు గ్రూపులు విడిపోయి కొట్టుకున్నారు. దాంతో 15 నిమిషాల పాటు నడిరోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. స్థానికులు కొందరు పోలీస్ కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారి రాకను గమనించిన విద్యార్థులు చెల్లాచెదురుగా విడిపోయి పారిపోయారు. విద్యార్థులు కొట్టుకునే సమమంలో రోడ్డుపై వాహనాలు ఆగిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అదే కాలేజీలో చదువుతున్న ఒక అమ్మాయి ప్రేమ విషయంపై జరిగిన చర్చలో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగిందని తోటీ విద్యార్థులు చెప్పకనే చెప్పారు.

● **గతంలో ఇలాంటి ఘటనలు జోరు :**

అదే కళాశాలకు చెందిన విద్యార్థులు గతంలోనూ సుమారు ఐదుసార్లు కొట్టుకున్న సందర్భాలు ఉన్నాయని స్థానికులు ఆరోపించారు. ఇటీవల కళాశాల ఫ్రెషర్‌డే రోజూ రెండు గ్రూపులుగా విడిపోయిన విద్యార్థులు అమ్మాయి కోసం కొట్టుకున్నారు. అమ్మాయిల కోసమే తరుచుగా ఇలాంటి గొడవలు జరుగుతున్నాయని కాలేజీ పక్కన ఉన్న కొంతమంది దుకాణదారులు తెలిపారు.

ఫిర్యాదు రాలేదు : ఎస్సై రామకృష్ణ

సికింద్రాబాద్ ఎస్‌డి రోడ్డులో కాలేజీ విద్యార్థులు రెండు గ్రూపులుగా కొట్టుకున్న విషయం తెలిసిందని, ఈ విషయంలో ఎవరు కూడా తమకు ఫిర్యాదు చేయడానికి రాలేదని ఎస్సై రామకృష్ణ తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్‌ను పిలిపించి మాట్లాడితే.. కాలేజీ బయట కొట్టుకున్నారని, తమకేం సంబంధం లేదని చెప్పినట్లు తెలిపారు. ఎందుకు గొడవ జరిగిందన్న విషయంపై పూర్తిగా స్పష్టత రాలేదని ఎస్సై వెల్లడించారు.

న్యాయస్థానం ఆదేశాలతో నిపిడ్ డైరెక్టర్‌పై కేసు నమోదు

బోయినపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): నిపిడ్ సంస్థలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిని ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో సంస్థ డైరెక్టర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కార్ఖాన సీఐ రామకృష్ణ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కార్ఖాన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... నిపిడ్ (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజేబిలిటీస్) సంస్థలో పిడియాట్రిక్స్ అసోసియేట్ డైరెక్టర్ జి. మేరి అనురూప విధి నిర్వహణలో ఉన్న తనను సంస్థ డైరక్టర్ బీవి. రామ్ కుమార్ తనగదిలోకి అనుమతి లేకుండా వచ్చి అకారణంగా దుర్భాషాలాడినట్లు ఈ నెల 7వ తేదిన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో మేరి ఫిర్యాదును సికింద్రాబాద్ పదకొండవ మెట్రోపాలిటన్ అదనపు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్ళి న్యాయమూర్తి ఆదేశాలతో రామ్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ విషయమై నిపిడ్ డైరక్టర్ రామ్ కుమారు వివరణ కోరగా నిధి నిర్వహణలో అలసత్వం చేస్తుండడంతో తాను వివరణ కోరానని చెప్పారు. ఉద్యోగిని మేరి అనురూపపై సంస్థ ఉన్నతాధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగమంటూ దోచేశారు

● రూ. 1.13లక్షలు కొల్లగొట్టిన సైబర్ క్రిమినల్స్

● ఇన్‌స్టా రీల్స్ లైక్ చేయమని మోసం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): అతనో ప్రభుత్వ ఉద్యోగి.. వాట్సాప్‌లో పార్ట్ ఉద్యోగం ప్రకటన చూసి మరింత సంపాదించాలని అనుకున్నాడు. దాంతో వచ్చిన లింకును క్లిక్ చేశాడు. ఇంటి నుంచి ఇన్‌స్టా రీల్స్ లైక్ చేసి, డబ్బులు సంపాదించొచ్చు అంటూ బురిడీ కొట్టించిన సైబర్ క్రిమినల్స్ ఉద్యోగిని నమ్మించి బిట్‌కాయిన్స్‌లో పెట్టుబడి పెట్టించారు. ప్రారంభంలో లాభాలు ఇచ్చినట్లు నటించి చివరకు రూ.1.13లక్షలు దోచేశారు. మోసపోయిన బాధితుడు చివరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన 29 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగికి ఇటీవల వాట్సాప్‌లో ఒక ప్రకటన కనిపించింది. ఇంటి వద్ద నుంచే పార్ట్ ఉద్యోగం చేస్తూ ఇన్‌స్టా రీల్స్‌ను లైక్ చేసి డబ్బులు సంపాదించండి అని రాసి ఉంది. మరింత అదనపు ఆదాయం వస్తుందని భావించిన బాధితుడు వారు ఇచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. అందులో పూర్తి వివరాలతో పాటు.. బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేశాడు. అనంతరం వారు పంపిన ఇన్‌స్టా రీల్స్‌ను లైక్ చేశాడు. కానీ డబ్బులు రాలేదు. అందులో ఉన్న కాంటాక్టు నంబర్‌లో సంప్రదిస్తే ఎవరూ స్పందించలేదు. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి టెలిగ్రామ్‌లో వేరే లింకు పంపాము దాని ద్వారా కాంటాక్టు కావాలని చెప్పారు. దాంతో బాధితుడు టెలిగ్రామ్‌లో లింకును ఓకే చేశాడు. అలా వారు పంపిన ఇన్‌స్టా రీల్స్ టాస్క్‌లను పూర్తి చేసిన వెంటనే వారు అతని ఖాతాలో కొద్దిమొత్తంలో డబ్బులు వేసేవారు. అలా మెల్లగా వారి దారికి తెచ్చుకున్న నిందితులు బీటీసీలో పెట్టుబడులు పెడితే అతితక్కువ సమయంలో 10 నుంచి 20 శాతం కమీషన్‌తో ఎప్పటికప్పుడు తిరిగి చెల్లిస్తామని ఆఫర్ ఇచ్చినట్లు నమ్మించారు. దాంతో బాధితుడు ప్రారంభంలో చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టాడు. అందుకు వారు లాభాలు ఇచ్చారు. వాటిని ఖాతాలో జమ చేసుకున్న బాధితుడు ఇదంతా నిజమేనని నమ్మాడు. ఆ తర్వాత మెల్లగా రూ.1.13లక్షలు పెట్టాడు. ఆ తర్వాత నిందితులు విత్‌డ్రా ఆప్షన్ తొలగించారు. ఆ తర్వాత స్పందించడం మానేశారు. దాంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.



బొల్లారంలోని అయ్యప్ప దేవాలయంలో చిన్నారులతో ఎమ్మెల్యే శ్రీగణేష్



సీతాఫల్‌మండిలో కృష్ణుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న డీజీపీ సౌమ్యమిశ్రా తదితరులు



బోయినపల్లిలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

సికింద్రాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం కంటోన్మెంట్‌లో ఘనంగా జరుపుకున్నారు. బొల్లారం, మారేడుపల్లి, బోయినపల్లి ప్రాంతాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతం, కృష్ణుని లీలల గురించి ఈ సందర్భంగా భక్తులకు వివరించారు.

సీతాఫల్‌మండిలో..

బౌద్ధనగర్ : సీతాఫల్‌మండిలో త్రీస్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా వివిధ సెట్టింగులు, పువ్వులతో ఏర్పాటుచేసిన స్టేజీపై శ్రీకృష్ణుడు విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. తెలంగాణ డీజీపీ సౌమ్యమిశ్రా ముఖ్యఅతిథిగా పాల్గొని సోమవారం రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ యువనాయకుడు తీగుళ్ల కిషోర్‌గౌడ్ కృష్ణుని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా త్రీస్టార్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు డీజీపీని, కిషోర్‌గౌడ్‌ను ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బొగ్గుల కృష్ణ, చెన్నయ్యగౌడ్, లక్ష్మణ్‌రావు, అశ్విన్, జీవీ.కృష్ణ, చంద్రశేఖర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం అయ్యప్ప దేవాలయంలో ..

తిరుమలగిరి : శ్రీకృష్ణ జన్మదినం పురస్కరించొకొని బొల్లారంలోని అయ్యప్ప దేవాలయంలో అష్టమి రోహిణీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయంలో నిర్వహించిన అష్టమి రోహిణీ వేడుకలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నారాయణన్ ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. అయ్యప్ప దేవస్థానం అర్చకులు, కార్యవర్గ సభ్యులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. వేషధారణలో ఉన్న చిన్నారులు ఆదితో సాంప్రదాయబద్ధంగా ఆడుకున్నారు. సికింద్రాబాద్‌లోని కలాక్రుట్జ్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన బాల బాలికలు, కళాకారులు సంప్రదాయ నృత్యాలు చేశారు. బాల బాలికలు, కళాకారులకు దేవస్థానం తరపున ఎమ్మెల్యే శ్రీగణేష్ నారాయణన్ మెమెంటోలు అందజేశారు. అష్టమి రోహిణి ప్రత్యేక పూజ నిర్వహించారు. అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు మాజీ కలొనెల్ వేలాయుదన్, ఉపాధ్యక్షుడు బి.అనిల్ కుమార్, కార్యదర్శి రవినాయక్ సహాయ కార్యదర్శులు రాజేష్, కన్నదాసన్, కోశాధికారి నంబియార్, సహాయ కోశాధికారి విక్రమన్ పిల్లయ్ పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్ : సికింద్రాబాద్ శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధల నడుమ అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం 108 కలశాలతో మూల మూర్తులకు అభిషేకం నిర్వహించి స్వామివారిని సుందరంగా అలంకరించి బాలభాగం సమర్పించారు. అనంతరం సుదర్శన హోమం, విష్ణు సహస్రనామార్చన, మహానివేదన, తీర్థప్రసాద గోష్టి, సాయంత్రం విష్ణు సహస్రనామార్చన, ఊంజల్ సేవలను నిర్వహించి ప్రసాద గోష్టిని నిర్వహించారు.



ఆలయ అధికారులతో చర్చిస్తున్న కోట నీలిమ



అంబులెన్స్ డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న అంబులెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేశ్

అత్యవసర సమయంలో మాత్రమే అంబులెన్స్ సైరన్ వాడాలి

● గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ అంబులెన్స్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేష్

అడ్డగుట్ట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రోగుల్ని అంబులెన్స్‌లో తీసుకెళుతున్న సమయంలో అత్యవసర సమయంలోనే అంబులెన్స్ సైరన్ ఉపయోగించాలని గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ అంబులెన్స్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేష్ అంబులెన్స్‌ల డ్రైవర్లకు సూచించారు. మంగళవారం గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న తెలంగాణ ప్రైవేట్ అంబులెన్స్ సర్వీసెస్ కార్యాలయం వద్ద అంబులెన్స్ డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైద్రాబాద్‌లో ప్రధాన కూడళ్ల వద్ద అంబులెన్స్‌లో రోగులు లేకపోయినప్పటికీ సైరన్ వేసుకుని వెళుతుండడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, సాక్షాత్తు హైద్రాబాద్ నగర పోలీసులు గుర్తించారని అన్నారు. ఈ క్రమంలోనే సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి నుంచి కొన్ని వందల అంబులెన్స్‌లు వివిధ జిల్లాలు, పట్టణాలకు వెళుతున్న క్రమంలో రోగుల్ని తీసుకెళ్లేటప్పుడు అత్యవసర సమయంలోనే అంబులెన్స్ సైరన్ ఉపయోగించాలని సూచించారు. అంబులెన్స్‌లో ఖాళీగా వెళుతున్న సమయంలో ఎవరు కూడా సైరన్ వేయకూడదని అంబులెన్స్ డ్రైవర్లకు సూచినలిచ్చారు. ఇటీవల నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ట్రాఫిక్ ఈస్ట్ జోన్ డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ సంపత్, చిలకలగూడ సీఐ శ్రీనివాస్‌ల ఆదేశాల మేరకు అంబులెన్స్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోగుల్ని తీసుకెళ్లే సమయంలో అంబులెన్స్ దస్తావేజీలు సరిగ్గా ఉన్నాయా, లేవా సరిచూసుకోవాలని, ఎవరినిపడితే వారిని అంబులెన్స్‌లో కూర్చోనివ్వకూడదన్నారు. మృతదేహాలను తరలించే సమయంలో అంబులెన్స్ సైరన్ ఉపయోగించకూడదని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో మజహార్, నరేందర్, సాదిక్, ముఖేష్, లాయిఖ్, హరికృష్ణ పాల్గొన్నారు.

యువత భవిష్యత్తు కోసమే 'హూనర్ ప్రయాస్'

● శ్రవణ్ కుమార్ గోన్, మయూర్ పట్నాల

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తు కోసం పని చేస్తున్నామని కె.రహేజా తెలంగాణ, ఏపీల సీఓఓ శ్రవణ్ కుమార్ గోన్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ ఎస్డీ రోడ్డులోని మినర్వా కాంప్లెక్స్‌లో గల "హూనర్ ప్రయాస్" శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మయూర్ పట్నాలతో కలిసి మాట్లాడుతూ... మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్ ఆర్ఈఐటీ స్వచ్ఛంద సంస్థ అయిన నిర్మాణ్.ఓఆర్‌జితో భాగస్వామ్యం చేసుకుని హూనర్ ప్రయాస్ పేరిట నైపుణ్య, ఉపాధి కార్యక్రమాల ద్వారా యువతకు సాధికారిత కల్పిస్తున్నామన్నారు. నేటి పోటీ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను అందించడం ద్వారా అట్టడుగు వర్గాలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని వివరించారు. మార్చి 2025 నాటికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 1000 మంది యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హూనర్ ప్రయాస్ కార్యక్రమం కింద సికింద్రాబాద్, చందా నగర్, ఎస్‌డీ రోడ్డు, సూరారంలలో నాలుగు శిక్షణా కేంద్రాలను మైండ్‌స్పేస్ ఆర్ఈఐటి స్పాన్సర్ చేస్తున్నదని, శిక్షణ పొందిన వ్యక్తులు మైండ్‌స్పేస్ ఆర్ఈఐటి, కె.రహేజా కార్ప్ గ్రూప్‌ల ఇతర వ్యాపార విభాగాలు, బాహ్య కార్పొరేట్ భాగస్వాముల వద్ద కూడా ఉపాధిని పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడ ఎలక్ట్రీషియన్ వర్క్, సోలార్ పీవి ఇన్‌స్టాలేషన్, ఫుల్ - స్టాక్ జావా డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్, ఫుడ్ అండ్ బెవరేజ్, రిటైల్, ఐటి తదితర రంగాలను ఎంచుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ శిక్షణ పొందిన వారు ఏ విధంగా హూనర్ ప్రయాస్ వల్ల తమ జీవితంలో ఉపాధి అవకాశాలను పొందారో తమ అనుభవాలను పంచుకున్నారు.

స్థానిక సమస్యలపై అధికారులతో కార్పొరేటర్ సామల హేమ సమావేశం

బౌద్ధనగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై మంగళవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమయ్యారు. ప్రజల మన్ననలు పొందేలా సమస్యలను పరిష్కారించాలని కోరారు. వినాయకచవితిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు, మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్‌జనీర్ వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పాగుచ్ఛాలందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి దశరధ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రతను కల్పించాలి

● కాంట్రాక్ట్ అధ్యాపకుల డిమాండ్

తార్నాక, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం యూజీసీ పే స్కేల్‌తో పాటు, ఉద్యోగ భద్రతను కల్పించాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించడంతో పాటు, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గత కొన్నిసంవత్సరాలుగా విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న తమ ప్రస్తావన లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. గత 25 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా కొనసాగుతున్న తమను రెగ్యులరైజ్ చేసిన తరువాతే రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, లేనిపక్షంలో దశలవారీగా అందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డా.ధర్మతేజ, డా.విజయేందర్ రెడ్డి, డా. ఈ. ఉపేందర్, డా.తాళ్ళపల్లి వెంకటేష్, డా.రమేష్ రెడ్డి, డా.యాదయ్య, డా.చిరంజీవి, డా.భుక్యా రమేష్, డా.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు డా. దర్మతేజ తదితరులు



ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు

పీహెచ్‌డీకి నెట్‌ను తప్పనిసరి చేయొద్దు

● ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి

విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌డీలో చేరేందుకు యూజీసీ నెట్ తప్పనిసరి అనే నింబంధనను వర్సిటీ అధికారుల ఎత్తివేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు మంగళవారం ఓయూ రిజిష్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణను ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్. మూర్తి మాట్లాడుతూ పాత పద్ధతిలోనే పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని, యూజీసీ నెట్ తప్పనిసరి నింబంధనను విరమించుకోవాలని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా ఓయూ పీహెచ్‌డీ కేటగిరి - 2 నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని రిజిష్ట్రార్‌కు విన్నవించామని, దానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్, ఉపాధ్యక్షుడు అజయ్, మల్సూర్, శర్మ, అరవింద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్‌పల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం నందమూరినగర్ బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం 6వ వార్డు నందమూరినగర్‌లో నెలకొన్న సమస్యలపై స్థానికుల వద్ద నుంచి వస్తున్న ఫిర్యాదులకు స్పందించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బద్దం బల్వంత్‌రెడ్డితో కలిసి మంగళవారం బోయిన్‌పల్లిలోని నందమూరినగర్ బస్తీలో పర్యటించారు. ఈ నేపథ్యంలో బస్తీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు. అంతేకాకుండా ఇళ్ల పట్టాల విషయంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రజలు ఆయనకు గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల పట్టాలకు సంబంధించి త్వరలోనే తీపిక బురు ఉంటుందన్నారు. రానున్న రోజులలో నందమూరినగర్‌ను ఆదర్శవంతమైన బస్తీగా తీర్చిదిద్దుతానని అన్నారు. తానుఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సదా, శివ, లక్ష్మి, పద్మ, పార్వతిలతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలు

మారేడుపల్లి : కంటోన్మెంట్ నియోజకవర్గంలో అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలు చేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం పికెట్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ముఖ్యంగా గృహజ్యోతి పథకం తమకు అమలు కావడంలేదని ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులతో స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి కంటోన్మెంట్ నియోజకవర్గంలో మరోసారి దరఖాస్తులు తీసుకుని అర్హులకు పథకం అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న 8 వార్డులతో పాటు మోండా డివిజన్‌లలో ఒక్కో రోజు ఒక్కో వార్డులో దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు డీఈలు, ఏఈలు రవికుమార్, నరేష్‌రెడ్డి, సాయి జగదీష్, భరత్, అర్పిత, వంశిధర్ రెడ్డి, రాకేష్, శ్రీధర్, రామానుజాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు

అడ్డగుట్ట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అప్సా టెక్ మహేంద్రా ఫౌండేషన్ మెడికల్ కోడింగ్‌లో శిక్షణ, ఉపాధిపై బుధవారం తుకారాంగేట్ చౌరస్తాలో ఉచితంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం తెలిపారు. అప్సా టెక్ మహేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు నాలుగు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వయస్సు 20 నుంచి 28ఏళ్ల వయస్సు గల బీఎస్సీ, ఎంఎస్సీ, బీఫార్మ, బీకాం, విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో బేసిక్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఇంటర్వ్యూ కూడా ఉంటుందని ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు 9154990132, 9154990130 నెంబరుకు సంప్రదించాలని కోరారు.



వార్డు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న మనోజ్ కుమార్

వార్డు కార్యాలయం ఉండేది ఇలాగేనా?

● త్రికాల మనోజ్ కుమార్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తమ సేవలను అందించే వార్డు కార్యాలయం ఉండేది ఇలాగేనా అని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం పాన్ బజార్‌లోని రాంగోపాల్‌పేట్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించి, ప్రజాపాలన దరఖాస్తుల పరిస్థితి గురించి జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య పీఏ కిరణ్ తదితర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు కార్యాలయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.... దుర్గంధపూరితంగా ఉన్న మరుగుదొడ్ల స్థితిని చూపుతూ అసలే డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో వార్డు కార్యాలయంలోనే ఇలాంటి స్థితి ఉంటే ఇతర ప్రాంతాలలో పరిస్థితి ఎలా ఉంటుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి కార్యాలయ ఆవరణను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

1న మట్టిగణపతి విగ్రహాల తయారీ పోటీ

సనత్‌నగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా పిల్లలకు పర్యావరణాన్ని రక్షించడం, పండుగ ప్రాశస్త్యం తెలిపేందుకు మట్టిగణపతి తయారీ పోటీలను నిర్వహిస్తున్నట్లు మోడల్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మోడల్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్లో సెప్టెంబర్ 1న నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు 14ఏళ్లలోపు బాలబాలికలు అర్హులని తెలిపారు. ప్రతిమ తయారీకి అవసరమైన మట్టిని అందిస్తామని, అలంకరణ సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న పిల్లలు 8008352140కు వాట్సాప్ చేసి పేరునమోదు చేసుకోవాలనినిర్వాహకులు సూచించారు.

చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఖైరతాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ విధిగా స్వచ్ఛ ఆటో టిప్పర్లకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. ఖైరతాబాద్ ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, వైద్యాధికారి చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి ఎంఎస్ మక్తా, బీఎస్ మక్తాలో పారిశుధ్య పనితీరుపై మంగళవారం ఆయన ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. స్వచ్ఛ ఆటో టిప్పర్ల వారు 100 శాతం ప్రతీ ఇంటికి వెళ్లేలా చొరవ చూపాలని సూచించారు.


డీఎంసీ ఆగ్రహం..

ఎన్టీఆర్‌మార్గంలో చిరు వ్యాపారులు చెత్తను తమ వద్దే ఉంచుకొని సిబ్బందికి అందజేయాలని డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ మార్గంలో పర్యటించారు. అక్కడ చిరు వ్యాపారుల ద్వారా రోడ్డుపై పడ్డ చెత్తను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలు ప్రతి సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలని, చిరు వ్యాపారులను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు.

అమ్మవారి తలుపులకు కిలో వెండి బహుకరిస్తా..

● ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఆగస్టు 27, (ఆంధ్రజ్యోతి) : శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి తలుపులకు ఒక కిలో వెండిని బహూకరిస్తానని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని శ్రీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారికి శ్రావణ మాసం చివరి మంగళవారం సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయ కమిటీ వారి కోరిక మేరకు అమ్మవారికి వెండిని బహూకరిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటి సభ్యులు మాజీ కార్పొరేటర్ నీరుకొండ జగదీష్‌గౌడ్, మంజులగౌడ్ బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు.

సంబరాలు జరుపుకున్న భారత జాగృతి, తెలంగాణ విద్యార్థి జేఏసీ

తార్నాక, ఆగస్టు 27, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని హర్షిస్తూ యునైటెడ్ పూలే ఫ్రంట్, భారత జాగృతి, తెలంగాణ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు బీసీ నర్సన్న, బి.లింగం, అశోక్ యాదవ్, ఆనంద్, వలమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.